క్లుప్తంగా

క్రైస్తవులకు ప్రముఖుల శుభాకాంక్షలు

కనిగిరి రూరల్: క్రైస్తవులకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కరుణామయుడు, లోక రక్షకుడు ఏసు క్రీస్తు జన్మించిన పవిత్ర దినం క్రిస్మస్‌ను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆ కాంక్షించారు. ఏసు ప్రభువు దీవెనలు, ఆశీస్సులతో సర్వ మానావళి ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలన్నారు.

కందుకూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ వేడుకలను బంధుమిత్రులతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవులంతా పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి రామాలయానికి అయోధ్య అక్షతలు



అయోధ్య అక్షింతలను రామాలయాలకు తరలిస్తున్న భక్తులు

పామూరు: మండలంలోని ప్రతి రామాలయానికి అయోధ్య అక్షతలను తరలిస్తున్నట్లు వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ యేల్చూరి బాల కొండలరావు, దరిశి మస్తాన్‌రావు తెలిపారు. శ్రీరామ భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించి అనంతరం అక్షతలను వివిధ ఆలయాలకు పంపారు. పరుచూరి రామారావు, శేగు క్రిష్ణయ్య, పాటోలు శివ, శివాజీ, దరిశి సత్యనారాయణ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు భగవాన్ కాశినాయన ఆరాధనోత్సవం

కనిగిరి రూరల్: భగవాన్ కాశీనాయన 28వ ఆరాధన మహోత్సవం ఈ నెల 26న మంగళవారం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న కాశీనాయన ఆశ్రమంలో జరుగుతుందని ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరాధనోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, అలంకరణ పూజ, హారతి, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భైరవకోనలో భక్తుల సందడి

సీఎస్‌పురం(పామూరు): భైరవకోనలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ముక్కోటి ఏకాదశి, ఆదివారం, సోమవారం వరుస సెలవుదినాలు కావడంతో ఆదివారం భైరవకోనకు నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి జిల్లాస్థాయి అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా జలపాతాన్ని సందర్శించి అనంతరం త్రిముఖదుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర, భర్గులేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్

వలేటివారిపాలెం: మండలంలోని బడేవారిపాలెం సర్పంచ్ దార్ల కోటేశ్వరమ్మ, అత్తంటివారిపాలెం కొల్లు లక్ష్మమ్మ అధ్వర్యంలో రెండు గ్రామ పంచాయతీల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. వ్యవసాయాధికారి హేమంత్‌భరత్‌కుమార్, డాక్టర్ మణిదీపిక, జెడ్పీటీసీ భారతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ



చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

గుడ్లూరు: మండలంలోని మూర్తింపేటలో ఎస్టీ కాలనీలో 100 మంది మహిళలకు బ్లెస్సింగ్ హ్యాండ్స్ మినిస్ట్రీస్ సంస్థ అధ్యక్షురాలు తలకాయల హేమలతా ప్రభాకర్ ఆదివారం రాత్రి పంపిణీ చేశారు. దాతలు గోనుగుంట వెంకటేశ్వర్లు, సింహాద్రిలు దుప్పట్లు, చీరలు అందించారు. కార్యక్రమంలో తలకాయల ప్రభాకర్, గోపి, మహేష్, సంజయ్, కోటమ్మలు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి రూ.50 వేల విరాళం



చర్చి అభివృద్ధికి విరాళం అందజేస్తున్న నేతలు

పామూరు: మండలంలోని వగ్గంపల్లె పంచాయతీ పరిధిలోని నిమ్మచెట్లపల్లె చర్చి అభివృద్ధికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య విరాళం ప్రకటించారు. ఈసందర్భంగా ఆదివారం చర్చిలో జరిగిన కార్యక్రమంలో విరాళం నగదు రూ.50 వేలను చర్చి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంబటి నాగులు, అచ్చయ్య, విష్ణు, రవీంద్ర, పుట్లూరి రవీంద్ర, పిన్నిక రమణయ్య, పుట్లూరి లక్ష్మీనారాయణ, చిరంజీవి, నాగార్జున, క్రైస్తవసోదరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన గణేశునిపల్లె ఆర్‌సీఎం చర్చి



ముస్తాబైన పట్టణంలోని ప్రముఖ జేడీబీఎం టౌన్ చర్చి



పామూరులో విద్యుద్దీపాలంకరణలో ఫిలడెల్ఫియా చర్చి



పామూరులో విద్యుద్దీపాలంకరణలో తెలుగు బాప్టిస్ట్ చర్చి

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ



విద్యుత్ దీపాలంకరణలో కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి



మర్రిపూడి : సామ్రాట్ అశోక్ నాటకంలో ఓ సన్నివేశం

పామూరు: లోక రక్షకుడు ఏసుక్రీస్తు పుట్టినరోజైన క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు చర్చిలన్నీ సిద్ధమయ్యాయి. దివి నుంచి భువికి దిగివస్తున్న ఆ కరుణామయుడిని స్వాగతిస్తూ ఇళ్లు, చర్చిల ముంగిట ఏర్పాటుచేసిన ప్రత్యేక విద్యుద్దీపాలు కాంతులీనుతున్నాయి. క్రిస్మస్ స్టార్ ఉన్న ప్రతి ఇంటికి క్రీస్తు దీవెన ఉంటుందని క్రైస్తవులు విశ్వసిస్తారు. తెలుగు బాప్టిస్టు, ఫిలడెల్ఫియా, బేతేలు ప్రార్థనామందిరం, పెంతెకొస్తు, సీమోను ప్రార్థనా మందిరాలను అలంకరించారు.

వెలిగండ్ల: క్రిస్మస్ వేడుకలకు మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిల వద్ద పెద్ద స్టార్‌లు ఏర్పాటు చేశారు. చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. మండలంలోని గణేశునిపల్లె ఆర్‌సీఎం చర్చితో పాటు, పలు గ్రామాల్లో తెలగుబాప్టిస్టు, రెహబోతు ప్రార్థనా మందిరాలు వేడుకలకు సిద్ధంగా ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో కాంతులీనుతున్నాయి.

కనిగిరి రూరల్: క్రిస్మస్ పండుగకు కనిగిరి ప్రాంతంలోని వివిధ చర్చిలను ముస్తాబు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో క్రిస్మస్ భారీ స్టార్స్ ఏర్పాటు చేశారు. కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి, పాతూరులోని ఓల్డ్ టౌన్‌బాపిస్ట్ చర్చి, శంఖవరంలో ఆర్‌సీఎం చర్చి, చాకిరాలలోని చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

హనుమంతునిపాడు: మండలంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. హనుమంతునిపాడులో ఆర్‌సీఎం బాప్టిస్టు, కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు, హాజీపురం, కొండారెడ్డిపల్లి, వేములపాడు, ఉసుళ్లపల్లి, తురకపల్లి గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

కందుకూరు: క్రైస్తవుల పెద్ద పండుగ క్రిస్మస్ వేడుకలకు పట్టణంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా జరిగే ప్రత్యేక ప్రార్థనలు, వేడుకలకు పెద్ద ఎత్తున ఆయా చర్చిల్లో ఏర్పాటు చేశారు. పట్టణంలోని జేడీబీఎం టౌన్ బాప్టిస్టు చర్చి, విక్కిరాలపేట రోడ్డులోని విలియం కేరీ తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి, కోవూరు రోడ్డు, కనిగిరి రోడ్డు, ఆదియేంద్రకాలనీ, ప్రకాశం కాలనీ, జనార్దనకాలనీ, ఉప్పుచెరువు తదితర ప్రాంతాల్లోని చర్చిలన్నీ ముస్తాబు

కందుకూరు రూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండలంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్ ఆలకరణలతోపాటు, పెద్ద పెద్ద లైటింగ్ స్టార్స్ ఏర్పాటు చేశారు. చర్చిలు విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా నిలిచాయి.

అలరించిన సామ్రాట్ అశోక్ నాటకం

మర్రిపూడి: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని మండల కేంద్రమైన మర్రిపూడి ఎస్సీ కాలనీలో ప్రదర్శించిన సామ్రాట్ అశోక్ సాంఘిక నాటకం ఎంతో అలరించింది. అలాగే ఆదివారం స్థానిక కళా భవనంలో శ్రీపృథులగిరి లక్ష్మీనృసింహస్వామి నాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయభారం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలను గ్రామ పెద్దల సహకారంతో ప్రదర్శించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మర్రిపూడి ఎస్సీ కాలనీలో చిన్నారులు క్రీస్తు గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.



కొండముడుసుపాలెంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి



హెచ్‌ఎంపాడులో విద్యుత్ దీపాలతో ముస్తాబైన ఆర్సీఎం చర్చి

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం



గుడ్లూరులో 5కే రన్ ప్రారంభిస్తున్న ఎంపీపీ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓలు

కనిగిరి రూరల్: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమం చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని వివరిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదివారం పట్టణంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యతను వెలికి తీయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 26 నుంచి జరిగే కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీల ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సినిమాహాల్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. 5కె రన్‌లో విజేతలుగా నిలిచిన యువకులకు బహుమతులను అందజేశారు. ఎంపీడీఓ రాజశేఖరరావు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పీడీ మాల్యాద్రి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో శనివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాగుంట రాఘవరెడ్డిల సౌజన్యంతో నియోజవర్గ స్థాయి ప్రకాశం క్రికెట్ లీగ్ మాగుంట క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఉన్నత లక్ష్యంతో క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణా, తమ్మినేని సుజాతరెడ్డి, కౌన్సిలర్ శ్రీరాం సతీష్, పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, కోఆప్షన్ సభ్యుడు జి.అబ్రహం లింకన్, భారతీ, నాగూర్‌బీ, పెద్దిరెడ్డి, చంటి కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు, క్రీడా కారులు పాల్గొన్నారు. లీగ్ పోటీల్లో సుమారు 32 టీం లు నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 8 టీంలు తలపడ్డాయి. ఆరు మండలాల నుంచి యువత, విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా తిలకించారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



గీతా జయంతి వేడుకల్లో భక్తులు

కనిగిరి రూరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థాయి బ్రహ్మణ కళ్యాణ మండపంలో సామూహిక భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిమ్మరాజు రాజు వంశీకృష్ణా శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ జరిగింది. అచ్యుత తులసీ, కాపుగంటి శైలజ, రామ భక్త సమాజం మహిళా సభ్యులు భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు పారాయణం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మణ సంఘ అధ్యక్షుడు రామచంద్రుని మల్యాద్రి, ప్రముఖ న్యాయవాది మాచవరం సుబ్రహ్మణ్యం, మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, ఉమాకాంత్, పైడిమర్రి ప్రసన్న, అగస్త్య రాజు, హనుమంతరావు, అంబాల కిషోర్, సింగంపల్లి ఫణీ, కనమర్లపుడి లక్ష్మీ మోహన్, గర్రె శిరీషా, సింగరాజు ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సుబ్బారెడ్డిని కమిటీ సభ్యులు సన్మానించారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్న చంద్రమౌళి

కందుకూరు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నలమోతు చంద్రమౌళి ఆదివారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వలేటివారిపాలెం మండల నాయకులు ఇంటూరి హరిబాబు, గోవిందయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక కమిటీ విభాగంలో జిల్లా జనరల్ సెక్రటరీగా మండలంలోని తిమ్మారెడ్డిపాలెం సర్పంచ్ కేశంరెడ్డి పద్మావతిని నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం కందుకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంటను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ పెన్నా కిష్టయ్య, ఎంపీటీసి దగ్గు వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ నోటి వెంకటేశ్వర్లు, నాయకులు ఉన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



కేక్ కోస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

పామూరు: వినియోగదారులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఆవుల సురేష్, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఆదివారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వినియోగదారుల హక్కులను గురించి వివరించారు. ఫోరం ప్రకాశంజిల్లా కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రషీద్, శేషం మోసే, వీఆర్‌ఓ షేక్.రఫీ అహ్మద్, షేక్.ఖాసీం వలి, తిరుపతయ్య, శివశంకర్, దినేష్, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజుకు సన్మానం

కనిగిరి రూరల్: న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో దివంగత సీనియర్ న్యాయవాది కొప్పల్లి సుబ్బారాయుడు సతీమణి వెంగమ్మ, న్యాయవాదులు ఆదివారం ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్‌రాజును ఘనంగా సన్మానించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామన తిరుపతిరెడ్డి, పాశం పిచ్చయ్య, అచ్చుత సుబ్బారావు, బి.మోహన్, నాగార్జున, చింతంగుంట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాల అనంతరం అమ్మ వారి మూల విరాట్‌ను అర్చకులు శ్రీనివాసశర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాతల సహకారం అభినందనీయం



వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించిన దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదలాటరఫిలో ప్రభుత్వం, దాత ఉప్పలపాటి మహిపాల్‌రెడ్డి సహకారంత రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదకలగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహిపాల్‌రెడ్డి గ్రామస్తులకు ఉచితంగా స్వచ్ఛమైన మంచినీటిని అందించడానికి వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ పులి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు విఘ్నేగ్ పాల్గొన్నారు.

ఉచిత ప్రజా వైద్య శిబిరం ప్రారంభం



టంగుటూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాదాసి వెంకయ్య

టంగుటూరు: టంగుటూరు పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెంలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రముఖ వైద్యుడు మాదాసి వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదాసి వెంకయ్య మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని రోగాలు నయం చేసుకోవాలన్నారు. 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, 14వ వార్డు మెంబరు నత్తల హరిబాబు, 18వ వార్డు మెంబర్ బొడ్డు నాగకుమారి, తేళ్ల డేవిడ్, బొడ్డు శ్రీనివాసరావు, బొడ్డు వేణు, కారుమంచి తేజ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మహానివేదన, గోపూజ



మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ ఘనంగా నిర్వహించారు. గోవుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామి గర్భాలయాన్ని ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళ తాళాలనడుమ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో అయ్యలూరివారిపల్లె సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణరెడ్డి, ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, కే.వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానుగుంటను కలిసిన అనీల్‌కుమార్ యాదవ్

కందుకూరు: స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అనీల్ కుమార్‌యాదవ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కుమ్మర బ్రహ్మయ్య, నగళ్ల నారయ్య, లింగసముద్రం ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, ఓంకార్, ఇంటూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.